రూల్స్‌కి. అది మనిష్టమేకదా. ఉపవాసం వున్నప్పుడు నీరసంగా వుంటుం దనిపిస్తే కొంచం పాలు, మరీ అనిపిస్తే రెండు అరటిపళ్ళు, ఇంకా వుండ లేకపోతే కొంచం చలిమిడి ముద్దా, చివరకి ఉడకపెట్టనివి ఏవైనా తినొచ్చు. అలాగన్నమాట.

మిఠాయిలు అన్ని యాంగిల్స్‌కి మార్చి చూశారు. వాడు మూడు సార్లూ మిఠాయిలే తిన్నాడు. "అయితే ఈ వెధవ తిండిపోతు అవుతాడన్న మాట. నా ఆశలన్నీ అడియాసలై పోయాయి" అని బాధపడిపోసాగేడు శ్రీనివాసరావు.

అతని ఎదురుగా బుజ్జిగాడు ఘటోత్కచునిలా తింటున్న దృశ్యం కనపడింది.

"ఛ వెధవ" అని లోపలికి వెళ్ళిపోయాడు. ఇంతకీ బుజ్జిగాడు ఏం చేస్తాడో ఎవరికి తెలుసు?

—o—

# అసలు సంగతి!

మా దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళి అయితే పిల్లల్ని తీసుకుని విజయవాడ వచ్చాను. మా వారికి సెలవు లేక పెళ్ళికి రాలేదాయన.

ఆరోజు పగలు పన్నెండు గంటలకు లగ్నం. ఉదయం అందరం స్నానాలు చేస్తున్నాము. స్నానాల హడావిడి. మా ముగ్గురు అమ్మాయిలకు స్నానం చేయించాను. నేనుకూడా స్నానంచేసి విడిదిలోంచి వస్తున్నాను.

మా దూరపుబంధువు బామ్మగారు ఎదురయ్యారు. "అమ్మాయ్ నీళ్ళోసుకున్నావా?" అన్నారామె కుశల ప్రశ్నలయ్యాక.

"అవునండి" అన్నాను. ఆవిడ వెళ్ళిపోయింది.

పెళ్ళి అయ్యాక ఆ రాత్రి ఊరేగింపు వగైరా అన్నీ అయ్యాయి.

అందరం డాబామీద జంపఖానాలు వేసుకుని పడుకున్నాం. మా పెద్ద క్కయ్య నా ప్రక్కనే పడుకుంది.

"ఏమే ఆ శుభవార్త మాకు చెప్తే నీ నోటి ముత్యాలు రాలిపో తాయా? బామ్మగారికి చెప్పావుట. పోనీలే ఎవరికి చెప్తేనేం నీ కడుపున ఒక మగ నలుసు పుడితే వంశోద్ధారకుడు వుంటాడు మీకు—" అని ఏదో చెప్పుకుపోతోంది.

చెప్పద్దూ నాకు అసలు విషయం బోధపడటం లేదు.

"ఏమిటీ నీ వాగుడు ఈసారైనా మగపిల్లాడు అంటావ్" అన్నాను విసుగ్గా.

"ప్రొద్దున్న బామ్మగారితో నీళ్ళోసుకున్నానని చెప్పావుట. ఏం డబాయిస్తున్నావ్" అంది నవ్వుతూ పెద్దక్కయ్య.

స్నానాలుచేసి వస్తుంటే బామ్మగారు ఎదురైన సంగతి, ఆమెకు జవాబు చెప్పిన సంగతి చెప్పాను. తరువాత నేను ఆపరేషన్ చేయించు కున్న సంగతి కూడా చెప్పాను.

అసలు విషయం తెలిసాక "ఎప్పుడూ నీళ్ళోసుకున్నాను అని చెప్పకూడదుకదూ" అన్నా అక్కయ్యతో.

"స్నానం చెయ్యి తల్లీ. కానీ నీళ్ళోసుకోకు" అంది అక్కయ్య. ఇద్దరం నవ్వుకున్నాం.

"ఏంటమ్మాయిలూ నవ్వుకుంటున్నారు" అంది బామ్మగారు, ప్రక్కనే ఉన్నారామె.

"మా చెల్లాయ్ నీళ్ళోసుకుందటండి. అదే కనుక్కుంటున్నాను" అన్నాను.

"నే చెప్పలా?" అందామె.

—o—